క్లుప్తంగా

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

కె.గంగవరం: గ్రామంలో వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం స్వామి వారి కల్యాణాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయం వద్ద వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కల్యాణం జరిపారు. కల్యాణం అనంతరం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ అన్నదానంలో గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కల్యాణం తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు



తోటపేట రైస్ మిల్లులో రికార్డులు తనిఖీ చేస్తున్న జేసీ ధ్యానచంద్ర

రామచంద్రపురం రూరల్: నిబంధనల ప్రకారం రైస్ మిల్లుల నుంచి ఎఫ్‌సీఐకి పంపించాల్సిన బియ్యం సకాలంలో అందజేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర అన్నారు. మండలంలోని తోటపేటలో వెంకటేశ్వరా రైస్ ఇండస్ట్రీస్‌ని, ద్రాక్షారామ ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను, రామచంద్రపురం పట్టణంలోని బఫర్ స్టాక్ పాయింట్‌లను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ రైస్ మిల్లుల యాజమాన్యాలు రైతుల నుంచి ధాన్యం సేకరణలో నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఇంకా ఎవరైనా రైతులు ఉండిపోతే తక్షణం కొనుగోలు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ పి.తేజేశ్వరరావుకు సూచించారు. కింది స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లైస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ సుధాసాగర్, డీఎస్‌ఓ ఎ.పాపారావు, ఎంఎస్‌ఓ ఎస్‌కే అహ్మద్ అలీషా, డిప్యూటీ తహసీల్దార్ కర్రి మహాలక్ష్మినాయుడు, ఆర్‌ఐలు పెంకే సత్యమునీశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా లక్ష మల్లెల పూజ

మండపేట: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని కరాచీ సెంటర్ వద్ద గల భక్తాంజనేయ స్వామివారి ఆలయంలో సోమవారం లక్ష మల్లెల పూజ ఘనంగా జరిగింది. ఆలయ అర్చకుడు ఖండవిల్లి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో హనుమాన్ మాలధారులు, భక్తులు భక్తిశ్రద్ధలతో లక్ష మల్లెలు, హనుమద్ హోమం, తదితర పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ గెడా రాము, సభ్యులు రౌతు రాజు, జొన్నల శ్రీనివాస్, నూని హరిబాబు, సంక శ్రీనివాసరంగా, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

రామచంద్రపురం రూరల్: పదహారేళ్ల బాలిక కనిపించడం లేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ సోమవారం విలేకరులకు తెలిపారు. మండలంలోని కందులపాలెంకు చెందిన సమ్మంగి దుర్గ కుమార్తె ఈ నెల 14న ఉదయం కళాశాలకు వెళుతున్నట్లు చెప్పి వెళ్లింది. అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇళ్లు, పరిసరాల్లో విచారించినా ఫలితం లేకపోవడంతో ద్రాక్షారామ పోలీసులను ఆశ్రయించింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

మండపేట: అదనపు కట్నం కోసం భర్త, అత్తింటి వారు వేధింపులకు గురి చేస్తున్నట్టు వివాహిత ఇచ్చిన ఫిర్యాదుపై సోమవారం పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ కె.అప్పారావు తెలిపిన వివరాల మేరకు లక్ష్మీసాయి రంజితకు స్థానిక సైదిల్‌పేటకు చెందిన జిల్లా సాయి ప్రసాద్‌తో 2013లో వివాహమైంది. రూ.పది లక్షల నగదు, 15 కాసుల బంగారం ఇచ్చారు. కొంతకాలం తర్వాత అదనపు కట్నం కోసం భర్త, అత్తింటి వారు వేధింపులకు గురిచేస్తున్నట్టు లక్ష్మీసాయిరంజిత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నాయకుల పాదయాత్ర

కె.గంగవరం: మండలంలోని పామర్రు నుంచి కె.గంగవరం వరకు సోమవారం టీడీపీ రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రెడ్డి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, అభిమానులు పాదయాత్ర నిర్వహించారు. తొలుత పామర్రు మర్రిచెట్టు సెంటర్ వద్ద కేక్ కట్ చేసి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ యువనాయకుడు లోకేష్ పాదయాత్ర ప్రారంభించి 100 రోజులు పూర్తి చేసుకున్నందున పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. నాయకులు మరివాడ చిన్నికృష్ణ, సలాది రమేష్, పెంకే సాంబశివరావు, మాజీ జెడ్పీటీసీ మేడిశెట్టి రవికుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మండపేటలో బైక్ ర్యాలీ

మండపేట: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 100 రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం పార్టీ నాయకులు మండపేటలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు మండపేట పట్టణ, మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో పార్టీ కార్యాలయంలో సమావేశాలు నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడాలని పార్టీ శ్రేణులకు సూచించారు. నియోజకవర్గ పరిశీలకుడు చిన్నం బాబూరమేష్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

చేనుకు నిప్పు.. రైతుకు ముప్పు

- అంతరిస్తున్న సహజ సూక్ష్మక్రిములు
- అవగాహన రాహిత్యమే శాపం
- ధాన్యపు రాశులు, గడ్డిమేట్లకు ఇబ్బంది

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో వరి పంట కోతలు కోత మెషీన్‌ల పుణ్యమా అని త్వరగా పూర్తవుతున్నాయి. మధ్యలో అకాల వర్షాలతో కొంత ఆలస్యమైనా.. ఎండలు గట్టిగా కాస్తుండటంతో మళ్లీ చురుగ్గా వరి కోతలు జరుగుతున్నాయి. అయితే కొంతమంది రైతులు అవగాహన రాహిత్యంతో కోత మెషీన్‌ల వల్ల చేలల్లో మిగిలిపోయిన గడ్డికి నిప్పు పెడుతుండటంతో మిగిలిన రైతులకు శాపంగా మారుతోంది. వారు మా చేలో గడ్డికి నిప్పు పెట్టుకుంటున్నాం అని అనుకుంటున్నారు. కానీ అది భగభగలాడుతున్న ఎండకు ఒక చేను నుంచి మరోచేనుకు పాకుతూ ధాన్యం నిలువ చేసిన రైతులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. తమ పొలాలలో, చేల గట్లమీద నిల్వ చేసిన ధాన్యం రాశులకు ఎక్కడ నిప్పు అంటుకుంటుందోనని నానా హైరానా పడాల్సి వస్తుంది. ఉరుకులు పరుగుల మీద తమ ధాన్యపు రాశులను కాపాడుకోవడానికి బకెట్లు, బిందెలతో నీళ్లతో తడుపుకుంటూ నానా ప్రయాస పడాల్సి వస్తుంది. మరో పక్క ఫైర్ సిబ్బందికి కూడా స్థిమితం లేకుండా చేస్తున్నారు. ఒకే రోజు పలుచోట్ల రైతులు తమ పొలాల్లోని గడ్డికి నిప్పు పెడుతుండటంతో ఎటు వెళ్లాలో తెలియక తల పట్టుకుంటున్నారు. అప్పటికీ రామచంద్రపురంలోని ఫైర్ సిబ్బంది ఒకచోటుకి వెళ్లినా మిగిలిన చోట్లకు మండపేట, జగన్నాథపురం ఫైర్‌స్టేషన్ల నుంచి వాహనాలను, సిబ్బందిని రప్పిస్తున్నారు. ఇలా చేలల్లో నిప్పు పెట్టడం గత ఆరేళ్ల నుంచి రైతులు మొదలుపెట్టారు. వరికోత యంత్రాలతో కోతలు అయిపోయాక మిగిలిన గడ్డిని తీయించడం ఖర్చుతో కూడుకున్న పని కావడం, గత పంటల తాలూకా కేళీలు తరువాతి పంటలో ఇబ్బందులు తలెత్తుతాయనుకోవడంతో రైతులు ఈ విధంగా చేస్తున్నారు. అయితే చేలల్లో నిప్పు పెట్టడం వల్ల పంట పొలాల భూమిలోపలి రైతులకు మేలు చేసే సూక్ష్మ క్రిములు నశించిపోతాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. కొందరు రైతులు పెడుతున్న నిప్పు వల్ల విద్యుత్ వైర్లకు కూడా డ్యామేజీ జరుగుతుందని విద్యుత్ అధికారులు అంటున్నారు. గతంలో చేలల్లో నిప్పు పెట్టడం వల్ల కొంతమంది రైతుల ధాన్యపు రాశులు కాలిపోయాయి. వేసవి ఎండ వల్ల ఒక్క పొలంలో పెట్టిన నిప్పు దావానలంగా పక్కచేలకు, ఆ ప్రక్క చేలకు పాకుతూ గ్రామాలను కూడా చుట్టుముట్టే ప్రమాదం ఉందని రైతులు పొలాలకు నిప్పు పెట్టవద్దని వ్యవసాయ, విద్యుత్, ఫైర్‌శాఖల అధికారులు కోరుతున్నారు.



కాలిపోతున్న ధాన్యపు రాశుల్ని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్న రైతు (ఫైల్)

నియోజకవర్గం	వరి పంట ఎకరాల్లో	గతేదాది చేలకు నిప్పు పెట్టిన సంఘటనలు
రామచంద్రపురం	51,948	57
మండపేట	47,076	34

పొలాల్లో నిప్పుతో నష్టమే ఎక్కువ



వరి పొలాల్లో ప్రస్తుతం నిప్పు పెట్టడం వల్ల ఉపయోగం ఏమీ లేదు. పైగా దానివల్ల నష్టమే ఎక్కువ. మట్టిలో ఉండే రైతులకు మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోతాయి. ప్రకృతికి కూడా హాని చేసిన వారవుతారు. నిప్పు పెట్టడం వల్ల విషవాయువులు వ్యాప్తి చెందుతాయి. వాతావరణంలో వేడి పెరిగిపోతుంది. కోతలు కాగా మిగిలిన గడ్డిని పొలాలలోనే కలసిపోయేలా దుక్కు చేసుకుంటే మంచిది. అంతేకాని రైతులు ఎవరూ పొలాల్లో నిప్పు పెట్టవద్దు.

– ఎస్.సత్యప్రసాద్, మండల ఏవో, రామచంద్రపురం

పొరుగు రైతుల గురించి ఆలోచించండి



కొందరు రైతులు కేవలం తమ పొలంలో గడ్డికి మాత్రమే నిప్పు పెడుతున్నాం అనుకుంటున్నారు. కానీ మంటలు చాలా వేగంగా వ్యాపించి ప్రక్క చేలల్లో నిల్వ చేసుకున్న ధాన్యపు రాశులు కాలిపోతున్న సంఘటనలు గత ఏడాది చోటుచేసుకున్నాయి. ఈ విధంగా నిప్పు పెట్టడం వల్ల జరిగే మేలు ఏమీ లేదని వ్యవసాయ అధికారులు చెబుతున్నది గమనించుకుని రైతులు దయచేసి చేలల్లో నిప్పు పెట్టవద్దని కోరుతున్నాం.

– సంసాని నాగేశ్వరరావు, ఫైర్ ఇన్‌స్పెక్టర్, రామచంద్రపురం

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు

- కమ్మ సామాజిక వర్గం నుంచి ఓగిరాల దేవి
- టీడీపీ నుంచి తెనుకుల సంఘం నాయకులు
- తరలి వచ్చిన మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ తోట సమక్షంలో పార్టీలో చేరుతున్న ఓగిరాల దేవి, తెనుకుల సంఘం నాయకులు

మండపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి పలువురు చేరారు. పట్టణ ప్రముఖుడు, కమ్మ సామాజిక వర్గానికి చెందిన స్వర్గీయ ఓగిరాల బ్రహ్మాజీ సతీమణి, కుటుంబ సభ్యులు, అనుచరులు పార్టీలో చేరారు. అలాగే 13వ వార్డు నుంచి తెనుకుల సంఘం నాయకులు, ఒక మాజీ కౌన్సిలర్ టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి వచ్చారు. ఈ పరిణామం టీడీపీకి షాకిచ్చి నట్టయ్యింది. రాష్ట్ర రవాణశాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమక్షంలో వీరంతా పార్టీలోకి వచ్చారు. సోమవారం ఉదయం నుంచి ఓగిరాల ఇంటి వద్ద సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ తోటలకు బ్రహ్మాజీ సతీమణి దేవి ఘనంగా స్వాగతం పలికారు. తొలుత స్వర్గీయ బ్రహ్మాజీ చిత్రపటానికి మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ తోట పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ సోదర సమానుడైన బ్రహ్మాజీ కుటుంబంతో తనకు విడదీయరాని అనుబంధం ఉందన్నారు. భర్త బాటలో ప్రజలకు సేవ చేసేందుకు ముందుకు వచ్చిన దేవికి తమ సంపూర్ణ సహకారం అందిస్తానని భరోసానిచ్చారు. దేవి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నాయకత్వానికి ఆకర్షితులై తాము పార్టీలో చేరామన్నారు. తన భర్త మరణం తర్వాత కొందరు తమ కుటుంబాన్ని ఇబ్బందులు పాలు చేయాలని చూసినపుడు మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ తోట తమ అండగా ఉండి వారి ఆటలు సాగనీయలేదన్నారు. అనంతరం కుటుంబ సభ్యులు, వంద మందికి పైగా అనుచరులతో దేవి వైఎస్సార్ సీపీలోకి చేరారు. బ్రహ్మాజీ అనుచరుడు వేల్పూరి ముత్తు పార్టీలో చేరారు.

13వ వార్డు నుంచి

టీడీపీ మాజీ కౌన్సిలర్ కంది శ్రీనివాస్‌తో పాటు పట్టణంలోని 13వ వార్డు నుంచి మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు ఆధ్వర్యంలో తెనుకుల సంఘం నాయకులు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. సంఘ నాయకులు ముద్దుర్తి ఈశ్వరరావు, నేరేళ్ల కొండలరావు, చిప్పాడ సూర్యనారాయణ, శ్రీనివాస్, చిప్పాడ ఆదినారాయణ తదితర 50 మంది పార్టీలో చేరారు. మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ తోట వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కుటుంబంలో చేరిన వారందరికీ పార్టీ, తాను ఎల్లప్పుడు అండగా ఉంటామన్నారు. సీఎం జగన్ పాలనకు ఎక్కడికక్కడ ప్రజలు ఆకర్షితులవుతున్నారన్నారు. గతంలో వైఎస్సార్‌సీపీకి ఓటేయని వారు వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌కు ఓటేసి రుణం తీర్చుకుంటామని ఆనందంగా చెబుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని నూతనంగా పార్టీలో చేరిన యువతకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, అర్బన్, రూరల్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, పిల్లా వీరబాబు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఆలీఖాన్‌బాబా, సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, ఏఎంసీ డైరెక్టర్లు పలివెల సుధాకర్, షేక్ మస్తాన్, కొప్పిరెడ్డి పద్మావతి, పార్టీ నేత జిన్నూరి సాయిబాబా, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

జనసేనకు జనసైనికుల రాజీనామా

అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు బాధించాయని ఆవేదన



జనసేన పార్టీని వీడుతున్నట్టు ప్రకటించిన ఆ పార్టీ నాయకులు

మండపేట: ముఖ్యమంత్రిగా చూడాలన్న తమ ఆశలపై నీళ్లు చల్లుతూ తాను సీఎం రేసులో లేనని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు తమను బాధించాయని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో సోమవారం మీడియా సమావేశంలో మండపేట పట్టణ, మండలానికి చెందిన జనసేన నాయకులు వాసిరెడ్డి అర్జున్, తణుకు అశోక్, శాఖా సత్యనారాయణ తదితర 25 మంది పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్‌కల్యాణ్‌ను సీఎంగా చూడాలన్న ఆకాంక్షతో ఏడేళ్లుగా ఎన్నో కష్టనష్టాల కోర్చి పార్టీలో పనిచేశామన్నారు. అనేక సందర్భాల్లో సొంత ఖర్చులు సైతం భరించి పార్టీ బలోపేతానికి పాటుపడ్డామన్నారు. తాను సీఎం రేసులో లేనని చెప్పి పవన్‌కల్యాణ్ తమ ఆశలపై నీళ్లు చల్లారన్నారు. టీడీపీతో పొత్తు పెట్టుకుంటున్నట్టు ప్రకటించిన పవన్ కనీసం రెండేళ్లయినా తాను సీఎంగా ఉండేలా ఒప్పందం చేసుకుని ఉంటే తాము ఎంతో సంతోషించేవారమన్నారు. టీడీపీ అధినేతను గద్దె నెక్కించే అజెండాతో పొత్తు పెట్టుకోవడం తమకు ఇష్టం లేదన్నారు. జనసేనకు రాజీనామా చేసిన వారిలో పువ్వుల నాని, గంధం దేవీ వరప్రసాద్, హరిదాసుల దుర్గారావు, షేక్ జిలానీ, కొప్పిరెడ్డి ప్రవీణ్, అల్లవరపు నాగు, బండారు అయ్యప్ప, రామిశెట్టి వీర్రాజు, సత్తి వెంకటేష్, పూసల సత్తిబాబు, శాకా శ్రీనివాస్, పెద్దిరెడ్డి వాసు, కొప్పిరెడ్డి శ్రీను, యానాల రాజు, సోడసాని శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రైస్‌మిల్లు కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలి

రామచంద్రపురం రూరల్: కార్మికుల హక్కులను కాలరాస్తూ దోపిడీకి గురి చేస్తున్న రైస్ మిల్లుల యాజమాన్యాలపై కార్మికులు సమరశీల సమరానికి సిద్ధం కావాలని రైస్ మిల్లు కార్మిక సంఘం కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని ద్రాక్షారామలో గుర్రాల పరంజ్యోతి స్మారక గ్రంథాలయంలో నిర్వహించిన సమావేశంలో చీకట్ల మాట్లాడారు. రైస్ మిల్లులు అధికంగా ఉన్న మండపేట, ఆలమూరు మండలాల్లో కార్మికులు అరకొర కూలీ రేట్లతో పొట్ట నింపుకోవడానికి కష్టపడుతున్నారన్నారు. అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికుల జీవితాలతో ఆడుకుంటుందన్నారు. కనీస వేతన చట్టానికి అనుగుణంగా రైస్ మిల్లు కార్మికులకు వేతనాలు అందించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు కొప్పిశెట్టి రాంబాబు, సూరంపూడి గంగరాజు, నల్ల శ్రీను, కొమ్మిశెట్టి లోవరాజు, కంబాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదరికమే పథకాలకు ప్రామాణికం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- 12వ వార్డులో గడప గడపకూ..



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: రాజకీయాలు, కులమత వర్గాలకు అతీతంగా అర్హత కలిగిన పేదలందరికీ సంక్షేమ పథకాల లబ్ధిని చేకూరుస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి సోమవారం ఆయన పట్టణంలోని 12వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మూడేళ్ల పాలనలో ఆయా కుటుంబాల వారికి ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకుని అక్కడికక్కడే మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ తదితరులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ తోట మీడియాతో మాట్లాడుతూ మూడేళ్లలో చేసిన ప్రగతిని వివరించడంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకం అయ్యేందుకు చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. వ్యక్తిగత సమస్యలతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజా అవసరాలను గుర్తించి అందుకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతోందన్నారు. కౌన్సిలర్ మలసాని సీతామహాలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, సొసైటీ చైర్మన్ కుక్కల రామారావు, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, పార్టీ నాయకులు యాండ్ర బుజ్జి, ఓగిరాల దేవి, నేమాని శ్రీనివాస్, సిరంగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భగ భగలు

- 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- వేడిగాలులకు ఉక్కిరిబిక్కిరైన జనం
- నిర్మానుష్యంగా మారిన రోడ్లు



ఎండ తీవ్రతతో మండపేటలో వాణిజ్యకేంద్రమైన కేపీ రోడ్డు వెలవెల

మండపేట: ఎండలు మండిపోతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలకు వేడిగాలులు తోడై జన జీవనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. సోమవారం మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదై నిప్పుల కొలిమిని తలపించాయి. కాగా తెల్లవారుజామున దట్టంగా కమ్ముకున్న పొగమంచుతో ప్రజలు అవస్థలు పడ్డారు.

ఇటీవల సంభవించిన ద్రోణి తర్వాత ఎండలు బాగా ముదిరిపోయాయి. నాలుగు రోజులుగా 42 నుంచి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. భానుడి భగభగలకు జడిసి ఇళ్లలో నుంచి బయటకు రావాలంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. దీంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. మధ్యాహ్నం 11 గంటల సమయానికే దాదాపు షాపులన్నీ మూతపడుతున్నాయి. నిత్యం జనంతో రద్దీగా ఉండే మండపేట, రామచంద్రపురం పట్టణాల్లోని మెయిన్ రోడ్డు, ప్రధాన కూడళ్లు మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ జనసంచారం లేక వెలవెలబోతున్నాయి. ఇళ్లలోని వాటర్ ట్యాంకుల్లో నీరు వేడెక్కిపోతోంది. మరికొద్ది రోజుల పాటు ఎండల తీవ్రత ఉంటుందని అధికారులు అంటున్నారు. ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండే ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయటకు రావాలంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

కమ్మేసిన పొగమంచు

సోమవారం తెల్లవారుజామున పొగమంచు కమ్మేసింది. మండపేట పట్టణంతో పాటు మండల గ్రామాల్లోను దట్టంగా కమ్ముకున్న పొగమంచుతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 10 మీటర్ల దూరంలోని వారు కనిపించక ఉదయం ఆరు గంటల వరకు లైట్లు వెలుతురులోనే వాహనాలు రాకపోకలు సాగించాయి.



సోమవారం తెల్లవారుజామున కేశవరం - బొమ్మూరు రోడ్డులో కమ్మేసిన పొగమంచు

ఘనంగా కాటన్ జయంతి

కె.గంగవరం: ఉభయగోదావరి జిల్లాలను సస్యశామలం చేసిన అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పామర్రు పంచాయతీ వద్ద సర్పంచ్ వాసంశెట్టి వెంకట దుర్గ ఆధ్వర్యంలో జయంతిని ఘనంగా నిర్వహించాడు. ఆయన విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు సూరిబాబు, వీఆర్‌ఓ వెంకటేశ్వరరావు ఇతర పెద్దలు కాటన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ అనావృష్టితో అతలాకుతలం అవుతున్న గోదావరి జిల్లాలను ధాన్యాగారంగా మార్చిన ఘనంగా ఆయనదేనని కొనియాడారు. ఆయన చేసిన కృషి వల్ల గోదావరి జిల్లాలో ప్రతి ఒక్కరికీ నోటినిండా తిండి ఉంటుందన్నారు.

అన్నాయిపేటలో..

రామచంద్రపురం రూరల్: గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన సర్ ఆర్థర్ కాటన్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని అన్నాయిపేటలో సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబు ఆధ్వర్యంలో ఘనంగా నివాళి అర్పించారు. పంచాయతీ ఆవరణలోని కాటన్ దొర విగ్రహానికి పూలమాలలు వేశారు. సర్పంచ్ దొరబాబు మాట్లాడుతూ అనావృష్టి, కరువులతో ప్రజలు పడే ఇబ్బందులు చూసి ధవళేశ్వరం వద్ద ఆనకట్టను నిర్మించారన్నారు. క్షామపీడితమైన గోదావరి డెల్టాను సస్యశ్యామలం చేసి గోదావరి జిల్లాల ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చల్లా బుజ్జి, వార్డు సభ్యులు, పెద్దలు రావూరి సుబ్బారావు, అల్లం సుబ్బారావు, పెమ్మిరెడ్డి మురళీకృష్ణ, మాజీ ఉప సర్పంచ్ కాకిలేటి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి నారాయణాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



అన్నాయిపేటలో కాటన్ దొరకు నివాళి అర్పించిన సర్పంచ్ దొరబాబు తదితరులు



పామర్రులో కాటన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



దుగ్గుదుర్రులో కాటన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రైతు సంఘాల నాయకులు

దుగ్గుదుర్రులో..

కాజులూరు: ఉభయగోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన అపరభగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ మహాశయుని కీర్తి ప్రతిష్టలు ఎన్నటికీ మరువలేనివని పార్టీ నేత, దుగ్గుదుర్రు పీఏసీఎస్ చైర్మన్ రేవుళ్ల చిట్టియ్యదొర అన్నారు. సోమవారం మండలంలోని దుగ్గుదుర్రులో అమలాపురం పార్లమెంటరీ శెట్టిబలిజ సంఘం కన్వీనర్ కడలి రాంపండు ఆధ్వర్యంలో జరిగిన కాటన్ మహాశయుని జయంతిలో చిట్టియ్యదొర తదితర నేతలు పాల్గొని కాటన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తణుకువాడలో స్థానిక పీఏసీఎస్ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం, కాజులూరులో పార్టీ నేత యాళ్ళ నరసింహమూర్తి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ, గొల్లపాలెంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు, ఉప్పుమిల్లిలో సర్పంచ్ పెంకే సత్తిబాబు తదితరులు కాటన్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు పసలపూడి లోవరాజు, అడపా రాము, దెయ్యాల శ్రీనివాసు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

అపర భగీరథుడికి ఘన నివాళి



టేకిలో కాటన్ విగ్రహ దాతను సత్కరిస్తున్న గ్రామస్తులు

కపిలేశ్వరపురం: అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ జయంతి సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. కపిలేశ్వరపురం, టేకి, అంగర, వల్లూరు, తాతపూడి గ్రామాల్లోని కాటన్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టేకి వాటర్ ట్యాంక్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కాటన్ విగ్రహ దాత కోశెట్టి వెంకట్రావును సర్పంచ్ కుక్కల నాగమతి, మండల సాగు సలహా మండలి సభ్యులు మేడిశెట్టి దుర్గారావు, పీఏసీఎస్ చైర్మన్ మట్టపర్తి పాల్‌రాజ్, రైతులు సత్కరించారు. పలు గ్రామాల్లో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, రైతు నేతలు మాట్లాడుతూ కాటన్ విశేష జ్ఞానంతో నిర్మించిన ధవళేశ్వరం బ్యారేజి నేటి వ్యవసాయ రంగం ప్రగతికి పునాది అన్నారు.